రాజకీయ గ్రహణం

- ఆధిపత్య పోరుతో కౌన్సిల్ సమావేశాలకు బ్రేక్
- మున్సిపల్ ఆదాయానికి గండి
- మార్కెట్, ఎగ్జిబిషన్ మైదానం లీజు అనుమానమే
- సమన్వయం సాధించటంలో మున్సిపల్ అధికారులు విఫలం


ఎగ్జిబిషన్‌కోసం లీజుకు ఇవ్వని మైదానం



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి రాజకీయ గ్రహణం పట్టుకుంది. వైసీపీ, టీడీపీ ఆధిపత్య పోరుతో.. మార్కెట్, ఎగ్జిబిషన్ మైదానం లీజుకు ఇవ్వకపోవడంతో మున్సిపాలిటీ కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయింది. ప్రొద్దుటూరు మున్సిపల్ పాలకమండలి వైసీపీ చేతిలో ఉంది. మెజారిటీ లేకపోవడంతో టీడీపీ కౌన్సిలర్లు ప్రతిపాదించే అభివృద్ధి పనులు కౌన్సిల్‌కు తెచ్చి వాటికి ఆమోదం పొందే పరిస్థితి లేదు. దీంతో ఆ పనులు ఆమోదం పొందక పలుమార్లు రద్దయిపోయి వైసీపీ ఆధిపత్యం నెగ్గుతోంది. దీన్ని టీడీపీ జీర్ణించుకోలేక అసలు కౌన్సిల్ సమావేశాలు జరపకుండా, కమిషనర్‌ను సమావేశాలకు వెళ్లకుండా ఒత్తిడి చేస్తూ వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్ వేయాలని చూస్తోంది. దీంతో మెజారిటీ ఉన్నప్పటికీ మున్సిపల్ కమిషనర్ల సహకారం లేక కౌన్సిల్ సమావేశాలు నిర్వహించుకోలేక పలుమార్లు వైసీపీ ఆందోళన బాట పట్టడం, కోర్టులను ఆశ్రయించడం తప్పడంలేదు.

ఆదాయానికి గండి

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి కూరగాయల మార్కెట్ లీజు వేలం, ఎగ్జిబిషన్ మైదానం లీజు వేలం ద్వారా దాదాపు రూ.3 కోట్లపైనే ఆదాయం సమకూరుతుంది. కొంతకాలంగా టీడీపీ వైసీపీ మధ్య ఆధిపత్య పోరుతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. ఈ ఏడాది జనవరి 31న కేవలం బడ్జెట్ సమావేశం నిర్వహించిన చైర్‌పర్సన్ లక్ష్మీదేవి సాధారణ సమావేశాన్ని నిర్వహించకుండా వెళ్లిపోయారు. దీంతో టీడీపీ కోరం సభ్యులతో మున్సిపల్ తాత్కాలిక సభాధ్యక్షుడిగా మురళీధర్‌రెడ్డిని ఎన్నుకుని సభ నిర్వహించారు. అజెండాలోని అంశాలను ఆమోదించారు. ఇది చట్టవిరుద్ధమంటూ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి హైకోర్టులో కేసు వేవారు. దీంతో కూరగాయల మార్కెట్ లీజు వేలం, మున్సిపాలిటీకి కోట్ల ఆదాయం సమకూరే బొల్లవరంలోని మున్సిపల్ లేఅవుట్ ప్లాట్ల విక్రయం, మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ప్రతిపాదించటం లాంటి అంశాలు కోర్టు పరిధిలో చిక్కుకున్నాయి. కౌన్సిల్ ఆమోదం లేకుండానే అప్పటి కమిషనర్ మల్లికార్జున మార్కెట్ లీజు వేలం నిర్వహించారు. వేలంలో మార్కెట్ అసోషియేషన్ రూ.1,60,80,000 పాట పాడి లీజు దక్కించుకుంది. దీనిని చైర్‌పర్సన్ ఆమోదించకపోవడంతో మున్సిపాలిటీ రూ.1,60,80,000 ఆదాయం కోల్పోయింది. అలాగే ఎగ్జిబిషన్ మైదానం లీజు వేలం ద్వారా గత ఏడాది రూ.1.75 కోట్లు ఆదాయం రాగా.. ఈ ఏడాది ఎగ్జిబిషన్ లీజు వేలం ఇంకా నిర్వహించలేదు.


ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

రాజకీయ ఒత్తిళ్లతో..

కూరగాయల మార్కెట్ వేలం నిర్వహించి పాటదారునికి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి నెల వరకు ఏడాదిపాటు అప్పటించాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్లత్తో వేలం నిర్వహించకపోవడంతో ఇప్పటివరకు డిపార్టుమెంటు వసూళ్లతో మున్సిపాలిటీకి నష్టం వాటిళ్లుతోంది. ఇక మిగిలిన 6 నెలల కాలానికి మార్కెట్ లీజు వేలం వేసేందుకు వైసీపీ పూనుకుంది. అలాగే ఎగ్జిబిషన్ మైదానం లీజు వేలం నిర్వహించడానికి ఆగస్టు 30 న అజెండాలో పెట్టి కమిషనర్‌కు పంపించారు. కానీ కమిషనర్ ఈ సమావేశం నిర్వహించకపోవడం వివాదాస్పదమైంది. దసరా ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఎగ్జిబిషన్ నిర్వహణకు దసరా కంటే నెలముందే వేలం నిర్వహించాల్సి ఉండేది. ఈ తక్కువ సమయంలో అక్కడ మైదానం చదును చేసుకుని ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు, వినోద పరికాలను అమర్చుకోవడం సాధ్యపడదు. కనుక ఇప్పటికిప్పుడు అనుమతులు తీసుకొచ్చి వేలం నిర్వహించినా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేది అనుమానమేనని పలువురు భావిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఫోన్‌లో ఆంధ్రజ్యోతి వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఎంపీడీవోలకు ప్రమోషన్, పోస్టింగులు

కలికిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు పొందిన పలువురు ఎంపీడీవోలకు కడప, అన్నమయ్య జిల్లాల్లో వివిధ రకాల పదవుల్లో నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలు జిల్లా పంచాయతీ అధికారిగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డీఎల్డీవో జి.వెంకటనాయుడుకు పదోన్నతి ఇచ్చి అన్నమయ్య జిల్లా అదనపు ఈజీఎస్ అధికారిగా నియమించారు. కర్నూలు డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న వైపీ రమణారెడ్డిని పులివెందుల డ్వామా ఏపీడీగా నియమించారు. ఓబులవారిపల్లె ఎంపీడీవో ఎ.మల్‌రెడ్డికి పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా డ్వామా ఏపీవో (ఎంఅండ్‌ఈ)గా నియమించారు. కడప జిల్లా దువ్వూరు ఎంపీడీవో సి.రామకృష్ణయ్యకు పదోన్నతి కల్పించి సత్యసాయి జిల్లా పెనుగొండ డీఎల్డీవోగా నియమించారు. సంబేపల్లె ఎంపీడీవో ఎస్.రామచంద్రకు పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా కుప్పం డీఎల్డీవోగా నియమించారు. హిందూపురం ఎంపీడీవో వి.సరస్వతిని కడప జిల్లా డ్వామా కార్యాలయం ఏవోగా నియమించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

ఆక్రమిత భూముల పరిశీలన


చదును చేసిన గుట్టలను పరిశీలిస్తున్న తహశీల్దారు సంజీవరెడ్డి, రెవెన్యూ సిబ్బంది

దువ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం మదిరేపల్లి సమీప గుట్ట ప్రాంతంలోని సర్వే నంబరు 327లో జరుగుతున్న భూ ఆక్రమణలు, గ్రావెల్ తవ్వకాలపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తీవ్రంగా స్పందించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'చోటా నేత.. బడా మేత' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన కలెక్టర్ స్థానిక తహశీల్దారుకు ఫోన్ చేసి ఈవిషయంపై వాకబు చేశారు. దీంతో తహశీల్దారు సంజీవరెడ్డితోపాటు ఆర్ఐ జాన్సన్, వీఆర్వో వెంకటేశ్వర్లు సర్వే నంబరు 327 ప్రాంతానికి వెళ్లి పరిశీలన చేశారు. గుట్టలను చదును చేసిన ప్రాంతంతో పాటు గ్రావెల్ గుంతను పరిశీలించారు. అనతరం తహశీల్దార్ మాట్లాడుతూ గుట్టల్లో అనుమతులు లేకుండా భూమి చదును చేసి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై పోలీసు కేసు నమోదు చేయాల్సిందిగా ఎస్ఐ వినోద్‌కుమార్‌కు రాతమూలకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమణలపై కలెక్టర్‌కు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.

ఉల్లి కొనుగోళ్లు పకడ్బందీగా చేయాలి

- కంట్రోల్ రూమ్ నెంబరు 7095621491

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ఉల్లి క్వింటాల్ రూ.1200తో మార్క్‌ఫెడ్ ద్వారా ఈ నెల 4 నుంచి కొనుగోళ్లు ప్రారంభించామని, ఈ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఉల్లి కొనుగోలు ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కమలాపురం, మైదుకూరులో రెండు ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించిన ఉల్లి పంటను ఆరబెట్టి గ్రేడింగ్ చేసుకుని యార్డుకు తీసుకురావాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ఉల్లి కొనుగోలు చేస్తామన్నారు. ఉల్లి రైతులకు సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 7095621491 నెంబరులో సంప్రదించాలని అన్నారు.

కలశాలకు సంప్రోక్షణ



ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో విమాన శిఖర కలశాలకు సంప్రోక్షణను ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున శ్రీరామచంద్రమూర్తి ప్రతిష్ఠించిన సైకత లింగానికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ రాజగోపురంపై ఉన్న విమాన శిఖర కలశాన్ని ఇటీవల కోతులు తోయడంతో కిందపడింది. దీంతో కలశ పునఃప్రతిష్ఠాపన చేపట్టారు. ఉదయం విజ్ఞానపనము, మహాగణపతి పూజ, రక్షాబంధనము, లోకకళ్యార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. వేద పండితుడు విజయ్‌భట్టార్ ఆధ్వర్యంలో రుత్విక్కులు శాంతి కలశాభిషేకం, మంత్రపుష్పం, విమాన శిఖర కలశాలకు సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, మాజీ చైర్మన్ బుశెట్టి రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

కలశానికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ రాజారెడ్డి, వేద పండితులు

ఉల్లికి మద్దతు ధర ఇవ్వండి

- కలెక్టరేట్ వద్ద రైతుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఉల్లిని తగలబెడుతున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉల్లికి కనీస మద్దతు ధర ఇవ్వాలంటూ శనివారం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉల్లి రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు ఉల్లిగడ్డలపై పెట్రోల్ పోసి తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ జిల్లాలో దాదాపు పది వేల ఎకరాల్లో ఉల్లి సాగైందన్నారు. అయితే ఉల్లి ధర ఎన్నడూ లేని విధంగా పూర్తిగా పడిపోయిందన్నారు. ప్రభుత్వం క్వింటా రూ. 1200తో కొనుగోలు చేస్తామంటోందన్నారు. ఈ ధరతో పెట్టుబడులు కూడా రావని, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫారసు ప్రకారం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పి.భాస్కర్, సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎస్.వెంకటశివ, సి.సుబ్రమణ్యం, కేసి బాదుల్లా పాల్గొన్నారు.

వైవీయూకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్

- న్యాక్‌లో ఎ-ప్లస్ గ్రేడ్ సాధించాలన్నదే లక్ష్యం
- వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు


విలేకరులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2025లో వైవీయూకు ఉత్తమ ర్యాంకు లభించిందని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. న్యాక్‌లో ఎ-ప్లస్ గ్రేడ్ సాధించాలన్నదే లక్ష్యమని చెప్పారు. శనివారం వైవీయూలోని తన చాంబర్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలో స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీస్ 500పైన ఉండగా అందులో వైవీయూ 51 నుంచి 100లోపు ర్యాంకు దక్కించుకుందన్నారు.. 2006లో ఏర్పాటైన వైవీయూ పాత విశ్వవిద్యాలయాలైన అనంతపురం జేఎన్టీ యూ, ఎస్కేయూ, పద్మావతి విశ్వవిద్యాలయం సరసన నిలవడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. భారత ప్రభుత్వం తాజాగా సమస్య పరిష్కారం ఆధారిత పరిశోధనకు ప్రాధా న్యత ఇస్తోందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో సెవెన్ స్పోక్ యూనివర్సిటీస్ ఎంపిక చేయగా వాటిలో ఒకటి తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ రెండవది వైవీయూ కావడం గర్వకారణమన్నారు. తద్వారా వైవీయూలో పరిశోధనలకు రూ.10కోట్ల నిధులు రానున్నాయన్నారు. ప్రధానమంత్రి ఉచ్చరత్ శిక్ష అభియాన్ (పీఎం ఉష) కింద రూ.20కోట్ల నిధులు వచ్చాయని వాటిలో రూ.10.5కోట్లతో విద్యాలయానికి అకడమిక్ భవనం, ఆడిటోరియం నిర్మాణాలకు భూమి పూజ జరిగిందన్నారు. 2022లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ (న్యాక్) ఎ-గ్రేడ్ లభించిందని 2027లో న్యాక్ ఎ-ప్లస్ గ్రేడ్ సొంతం చేసుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. తాజాగా స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు పొందిన ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు, ప్రొఫెసర్ రియాజున్నీసాను వీసీ అభినందిం చారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యాలు ప్లేస్ మెంట్‌పైన ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్ర మణ్యాం శర్మ మాట్లాడుతూ వైవీయూలో 22 ప్రాజెక్టుల పరిశోధన జరుగుతున్నాయన్నారు. అందులో హెల్త్ అండ్ మెడికల్, క్యాన్సర్, డయాబెటిస్, ఫ్యాటీలివర్ విభాగాలలో పరిశోధనలు సాగిస్తున్నామన్నారు. వైవీయూకు ఎన్ఐఆర్ఎఫ్ ఉత్తమ ర్యాంక్ రావడం పట్ల విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైవీయూ డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రూ.50 కోట్లతో రైల్వేవంతెన


ఎక్స్‌కవేటర్‌తో ప్రారంభించిన పనులను తిలకిస్తున్న పుత్తా నరసింహారెడ్డి. పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తదితరులు

వల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లపరెడ్డిపల్లె - కొప్పర్తి మార్గంలోని అంబవరం రైల్వేగేటు వద్ద రూ.50 కోట్లతో చేపట్టిన రైల్వేవంతెన పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప - తాడిపత్రి, కొప్పర్తి ఇండస్ట్రియల్ వెళ్లేందుకు ఈ రైల్వేవంతెన చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటీవల మంత్రి లోకేశ్ పర్యటన సందర్భంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు కావాల్సిన అభివృద్ధి పనులు, పరిశ్రమల కోసం ఆయనతో చర్చించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. వ్యాపార దిగ్గజాలతో మాట్లాడి ఇక్కడికి పరిశ్రమలు వచ్చేలా తన వంతు కృషి చేస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఎంవీవీ సత్యనారాయణ, సౌత్ రైల్వే డిపార్ట్‌మెంటు ఏఈ దుర్గాప్రసాద్, ఏఈ కిశోర్, టీడీపీ నేతలు నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖలో ఉద్యోగాలకు నేడు పరీక్షలు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ అటవీ శాఖకు సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సహాయ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లకు ఆదివారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో కడప నగర పరిధిలో 9 కేంద్రాలు, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో 4, ప్రొద్దుటూరు పరిధిలో 4 కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. అభ్యర్థులు హెల్ప్‌డెస్క్ 08562-246344 ద్వారా సమాచారం పొందవచ్చన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- గండికోటలో రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్థులు


పనులను అడ్డుకున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

జమ్మలమడుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో శనివారం లోయకు వెళ్లే దారిలో చేపట్టిన రోడ్డు పనులను గ్రామంలోని కొందరు అడ్డుకున్నారు. ముందు తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలసి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఎస్ఐ గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో సమస్యలు తిష్టవేశాయని, ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానంగా టోల్‌గేటు వద్ద వసూలయ్యే డబ్బుల్లో 25 శాతం గ్రామం అభివృద్ధికోసం ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రధానంగా గ్రామానికి తాగునీటి సమస్య ఉందన్నారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గతంలో కోరినా స్పందన లేదన్నారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ ఇంతకాలం ఇవన్నీ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. అక్కడికి వచ్చినవారిని ఆయన జీపులో ఎక్కించుకుని జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆర్డీవో సాయిశ్రీ బిజీగా ఉండడంతో తహశీల్దారు కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ తహశీల్దారు శ్రీనివాసరెడ్డితో కాంట్రాక్టర్లు, గ్రామస్థులతో మాట్లాడారు.

గత నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గండికోటను సందర్శించారు. గండికోటతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో సుమారు రూ.55 కోట్ల అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. అందులో భాగంగా గండికోటలో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు సంబంధించిన కాంట్రాక్టర్లు శనివారం పనులు చేపట్టారు. దాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. అయితే అడ్డుకున్నవారు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మనుషులని ప్రచారం సాగుతోంది. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

జిల్లాను నెంబర్‌వన్ చేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- ఘనంగా సంపూర్ణత అభియాన్ సత్కార కార్యక్రమం


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్‌చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తదితరులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెం బరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాను జాతీయ స్థాయిలో నెంబర్‌వన్ చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. ఆకాంక్ష జిల్లా బ్లాకు ల్లోని ఆరు విభాగాల్లో లక్ష్యాలు సాధించిన నేపథ్యంలో సంబంధిత భాగ స్వామ్య శాఖల అధికారులు, ఫ్రంట్‌లైన్ అధి కారులు, సిబ్బందిని అభినందిస్తూ శనివారం కడపలోని ఓ ఫంక్షన్ హాలులో సంపూర్ణ అభి యాన్ సత్కార కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు ఆకాంక్ష బ్లాకుల్లో నీతి అయోగ్ గుర్తించిన ఆరు అంశాల్లో సంతృప్తికర స్థాయిని పొందడమే సంపూర్ణ అభియాన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. 2024 ఫిబ్రవరి నాటికి ఆకాంక్ష జిల్లా, బ్లాకుల్లో జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసు కుని వచ్చే సంపూర్ణత అభియాన్ అభివృద్ధి లక్ష్యాన్ని వందశాతం సాధించినందుకు నీతి అయోగ్ మన జిల్లాకు మొదటి ర్యాంకు ప్రకటించిందన్నారు. ఇందుకు కృషిచేసిన ఆయాశాఖల అధికారులు, సిబ్బందిని కలె క్టరు అభినందించారు. జిల్లాలో పీ4 పథకం లో భాగంగా స్టార్టప్ కడప ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెంటరు నిర్మాణం కోసం పునాది వేశామన్నారు. జిల్లాలో 85వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయ న్నారు. డ్వామా పథకం ద్వారా జిల్లాలో నీటిని పొదుపు చేస్తూ వాటర్ హార్వెస్టింగ్ పనులు లక్ష్యాలు అధిగమించి పూర్తి చేశామ న్నారు. ఆరు పారామీటర్లకు సంబంధించి రాష్ట్రస్థాయిలో కూడా అన్నిరకాలుగా ముందంజలో ఉన్నామన్నారు. రానున్న ఆరు నెలల్లో జిల్లా యువతకు అనేక రకాల విద్య, ఉపాధి అవకాశాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ కలెక్టరు సరికొత్త ఆలోచనలతో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకెళుతున్నారని అన్నారు. జిల్లాలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజన పథకం రుచి, శుచికరంగా, ఆరోగ్యకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు, ఎమ్మెల్యే అభివృద్ధి సాధనకు చిహ్నంగా హస్త ముద్రికలను అద్దడంతో పాటు జిల్లా హాస్టాగ్ కూడా ఇచ్చారు. ముందుగా ఆయా శాఖలు ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం అధికారు లకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధి కారి హజరతయ్య, డీఎంహెచ్‌వో నాగరాజు, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఈవో షంషు ద్దీన్, డీఏవో చంద్రనాయక్, డీఆర్‌డీఏ పీడీ జి.రాజ్యలక్ష్మి, ఎల్‌డీయం జనార్ధనం, అనుబం ధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడికి చెక్‌డ్యామ్

సృష్టికి జలమే జీవనాధారం. నీరు లేనిదే సమస్త జీవకోటి మనుగడ సాగదు. ఒకప్పుడు పుష్కలంగా వర్షాలతో చెరువులు నిండుకుండలా ఉండేవి. కానీ ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సమస్తం కాలుష్యంగా మారుస్తున్నాడు. దీంతో తీవ్ర నీటిఎద్దడి ఏర్పడుతోంది. వ్యవసాయం చేయాలంటే నీరు పుష్కలంగా ఉండాలి. కానీ ఈ నీటిఎద్దడి వలన వ్యవసాయం మరింత భారంగా మారుతోంది. ఈక్రమంలో నీటిఎద్దడిని తగ్గించేందుకు చెక్‌డ్యామ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. జలవనరులను నిల్వ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. కానీ ఈ చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో వర్షపునీరు చాలావరకు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో గుంజనేరులో వృథాగా పోతున్న నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు



ముళ్లపొదల్లో దర్శనమిస్తున్న చెరువు

చిట్వేలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకప్పుడు నిండుకుండలా కళకళలాడిన చెరువులు ప్రస్తుతం ముళ్లపొదలతో దర్శనమిస్తున్నాయి. మండలంలో తొమ్మిది పెద్ద చెరువులు, 27 చిన్న చెరువులు ఉన్నాయి. ఇందులో నాగవరం చెరువు కింద 433.40 ఎకరాలు, నగిరిపాడు చెరువు కింద 436.90, దేవమాచుపల్లె 138.10, గొట్టుమానుకోన చెరువు కింద 921, ఎల్లమరాజుచెరువు కింద 831, సిద్దారెడ్డిపల్లి చెరువు కింద 40.2, మైలపల్లి ఆనకట్ట చెరువు కింద 307, రాజకుంట చెరువు కింద 125, మాలేమార్పురం చెరువు కింద 29.2 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు లేకపోడంతో ఆయకట్టు భూములన్నీ ప్రస్తుతం బీడు భూములుగా మారాయి. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ప్రభుత్వం చెరువుల మీద దృష్టి సారించకపోతే రాబోయే రోజుల్లో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాకాలు ఉన్నాయని వాపోతున్నారు. చిట్వేలికి మరో మూలాధారం గుంజనేరు, అలిగేరు. ఒకప్పుడు నీటితో కళకళలాడుతు ఈ రెండు ఏర్లు ఇప్పుడు చుక్క నీరు లేక మొండిరాళ్లతో ఎడారిలా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అరకొర కురుస్తున్న వర్షాలను పొదుపు చేసుకోవాలన్నా, భవిష్యత్ తరాలు నీటి ఎద్దడిని అధిగమించాలన్నా చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని పేర్కొంటున్నారు. ఈ చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు వలన వర్షపునీరు నిలిచి భూగర్భజలాలు పెరుగుతాయి. అలాగే ప్రభుత్వం నీటి వనరులపై శ్రద్ధ చూపి నీటి పథకాలు, ఇంకుడు గుంతలను ప్రోత్సహించాలి. జలనవరులు తక్కువ ఉన్న ప్రాంతాల్లో బిందు సేద్యం, తుంపర సేద్యం ప్రోత్సహించడానికి ప్రభుత్వ సబ్సిడీలు పెంచాలని రైతులు చెబుతున్నారు. సేద్యపు నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. సమీకృత నీటి నిర్వహణ విధానాన్ని పటిష్టంగా అమలు పరచాలి. తద్వారా భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడిని లేకుండా కాపాడవచ్చు. ఇకనైనా ప్రభుత్వం నీటి భద్రతపై ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయమే ఆధారం..

డిగ్రీ పూర్తి చేసినప్పటికీ పాడి పంటలపై ఉన్న మక్కువతో నాకున్న నాలుగున్నర ఎకరాల్లో మూడెకరాల్లో గడ్డిమొక్కలు నాటాను. ఒకటిన్నర ఎకరాల్లో మామిడి పంటను పండిస్తున్నాను. నా చిన్ననాటి తనంలో వర్షాలు పుష్కలంగా కురుస్తూ గుంజనేరులో ఎప్పుడూ నీరు ప్రవహిస్తుండేది. దీంతో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటూ వ్యవసాయానికి ఆధారంగా ఉండేది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వ్యవసాయం భారంగా మారింది. అరకొర కురుస్తున్న వర్షాలను, నీటిని పొదుపు చేయాలంటే గుంజనేరులో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. ప్రభుత్వం పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.



- సింగనమల మల్లేశ్వరయ్య, రైతు



గుంజనేరు

గుర్రంకొండలో పట్టపగలే చోరీ

- 20 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు అపహరణ
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

గుర్రంకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలో పట్టపగలే వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పగలు తాళం వేసిన ఇళ్లను దుండగులు రెక్కీ నిర్వహించి దోచుకుపోతున్నారు. దీంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. పట్టణంలో నెల రోజుల వ్యవధిలో నాలుగు చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాధితుల వివరాల మేరకు... పట్టణంలోని బలిజగడ్డకు చెందిన శ్రీనివాసులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొలం వద్ద వ్యవసాయ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసుకొని వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకొని మధ్యాహ్నం 1గంటకు ఇంటికి వచ్చే సమయానికి దుండగులు తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి బట్టలను చిందర వందరగా పడేశారు. అంతేకాకుండా బీరువాలో ఉన్న నగదు, బంగారం వస్తువులను దోచుకుపోయారు. డ్రాలో ఉన్న రూ.60 వేల నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. పక్కనే ఉన్న మరో ఇంటిలో కూడా దుండగులు చోరీకి పాల్పడి ఇంటిలో వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రఘురాం సంఘటన స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. పది రోజుల క్రితం మరో రెండు ఇళ్లల్లో దుండగులు చోరీ చేసి నగదును దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టణంలో పట్టపగలే చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

సిద్దవటం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ద్విచక్రవాహనం చోరీకి గురికావడం చర్చణీయంగా మారింది. సిద్దవటం గ్రామంలో బందారుపల్లె ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బాలచంద్ర ఈనెల 4న ఉదయం 9గంటల సమయంలో కడపకు వెళుతూ ద్విచక్ర వాహనాన్ని పోలీసులైను క్రాస్‌రోడ్డులోని పోలీసుస్టేషన్ వెనుకభాగమైన గాలి మిషన్ వద్ద నిలిపివెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు వచ్చేసరికి అక్కడ ద్విచక్ర వాహనం కనపడకపోవడంతో పరిసర ప్రాంతాల్లో విచారించినా వాహనం ఆచూకీ దొరకలేదు. ఈ విషయమై ఈనెల 5వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం బాలచంద్ర మాట్లాడుతూ 2015లో ప్లాటినా ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి ప్రతిరోజు గ్రామంలో న్యూస్ పేపర్లు పంపిణీ చేసి అనంతరం కడపలోని ఓ ప్రైవేటు షాపులో పని చేసేందుకు వెళ్తానని, ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనాన్ని ఇక్కడ పెట్టి వెళతానన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారని వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దర్గా భూ వివాదంలో మహిళపై దాడి



గాయపడిన ముబీనాబీ

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాగిమాకులపల్లె క్రాస్ వద్ద ఉన్న మున్వర్‌ఆలీషా ఖాద్రి దర్గా భూ వివాదంలో దర్గా సభ్యురాలు ముబీనాబీపై దాడి జరిగింది. ఈ దాడిలో ముబీనాబీ తలకు తీవ్ర గాయమైంది. దర్గా కమిటీ సభ్యుల వివరాల మేరకు... దర్గా కమిటీ చైర్మన్ మున్వర్‌ఆలీషా ఖాద్రీ మృతి తర్వాత దర్గా కమిటీ సభ్యులు, మున్వర్ కొడుకు గౌస్‌పీర్ మధ్య చైర్మన్ పదవి కోసం కొన్ని నెలలుగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో ఈ దర్గాలో ఉరుసు జరుగనుంది. దీని నిర్వహణ కోసం ఇరువర్గాల మధ్య శనివారం మరోమారు వివాదం చోటుచేసుకోగా ఓ వర్గంవారు ముబీనాబీపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మఠం భూముల పరిరక్షణకు చర్యలు

కలికిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడికుర్తి క్రాస్ సమీపంలో ఉన్న శివయోగి మఠం భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథం తెలిపారు. రాష్ట్ర జంగం సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్‌తో కలిసి శనివారం ఆయన ఈ మఠం భూములను పరిశీలించారు. విలువైన మఠం భూములకు హద్దులు నిర్ధారించాలని రెవెన్యూ అధికారులను కోరనున్నట్లు విశ్వనాథం తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి ధూపదీప నైవేద్యం నిధుల మంజూరు కోసం వచ్చిన ప్రతిపాదనలకు సంబంధించిన ఆలయాలను ఆయన పరిశీలించారు. మండలంలోని కొటాల గ్రామంలోని సల్లాపురమ్మ ఆలయం, విశ్వేశ్వరాలయం, నల్లగంగమ్మ దేవాలయం, లక్ష్మీనగర్‌లోని మహాలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు మేడికుర్తి క్రాస్‌లోని శివాలయం, రంగనాథపురం రామాలయాలను ఆయన పరిశీలించారు.

వాలీశ్వరస్వామి ఆలయ భూముల సర్వే



ఆలయ భూములు సర్వే చేస్తున్న ఈవో రమణ

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం సమీపంలోని వాలీశ్వరస్వామి ఆలయ భూములను ఎండోమెంట్ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ ఆలయానికి మొత్తం 124ఎకరాల భూమి ఉంది. ఇందులో 49ఎకరాల భూమిని గత శివరాత్రి సందర్భంగా రైతులకు లీజుకు ఇచ్చారు. మిగిలిన భూమి అన్యాక్రాంతం కాగా వాటి లెక్క తేల్చడానికి శనివారం సర్వే చేపట్టారు. దేవదాయ శాఖ ఈవో రమణ మాట్లాడుతూ ఆలయ భూమిని కొందరు గ్రామస్థులు ఎండోమెంట్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే దురాక్రమణ చేసి సాగు చేస్తున్నారని, అలాంటి వారి నుంచి భూమి స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని దేవదాయ శాఖకు చెందిన ఇతర ఆలయాల భూమిని కూడా సర్వే చేయించి ఆ భూములను స్వాధీనం చేసుకుని వాటిని లీజుకు ఇచ్చి వచ్చిన ఆదాయంతో ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సర్వేలో ఎండోమెంట్ సర్వేయర్ రమేష్, మండల సర్వేయర్ నరేంద్ర, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాలతి



వాల్మీకిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వై.మాలతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పదోన్నతి పొంది అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డాక్టర్ మాలతిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మాలతి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక వైద్యులు, సిబ్బందితో సమావేశమై విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని రోగుల పట్ల మర్యాదతో మెలగాలన్నారు.

10లోగా సర్వేను పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో స్వామిత్వ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వే గ్రామాల్లో మెరుగైన సాంకేతికత, మ్యాపింగ్ కోసం ఏర్పాటైన పథకమన్నారు. స్వామిత్వ సర్వేతో గ్రామాల్లో ఆర్థిక, సామాజిక, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో ప్రధాని మోదీ ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పంచాయతుల్లో సర్వే పూర్తి కాగా మిగిలిన పంచాయతీ సిబ్బంది త్వరతగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపల కార్యదర్శులు రెవెన్యూ విలేజ్, గ్రామ కంఠం, ఎక్స్‌టెండెడ్ గ్రామ కంఠం తయారు చేసి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా విధానాలపై సీపీఐ నిరసన

బి.కొత్తకోట/ములకలచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రయోజనాలను, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా దేశ దిగుమతులపై 50శాతం సుంకాన్ని విధిస్తూ అగ్రరాజ్యం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ సీపీఐ నేతలు శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎర్రజెండాలతో నిరసన తెలిపారు. అమెరికా పెత్తందారి విధానాలపై మోదీ ప్రభుత్వం మౌనం వీడాలని ములకలచెరువు బస్టాండు వద్ద సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఊడిగం చేస్తున్న మోదీ దేశ ప్రయోజనాలను దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నేతలు మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, రఘునాథ్, బాబు, హబీబ్, షఫీ, గంగులప్ప, సోము మల్లికార్జున, రెడ్డెప్ప, సుబ్బన్న, రవణప్ప, ఉత్తన్న, రామచంద్ర, సరోజమ్మ, నరసమ్మ, శంకరమ్మ, శ్యామలమ్మ, లక్ష్మీదేవి, పాపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పీలేరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గాలికుంటు, బొబ్బల వ్యాధి రాకుండా ముందుగానే పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యుడు డాక్టర్ రామచంద్రుడు సూచించారు. ఆత్మా చిన్నగొట్టిగల్లు బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం తలపులలో పశుపోషణ ఆవశ్యకతపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలంటే పశుపోషణలో ముఖ్యమైన సైలేజ్ తయారీ విధానంపై రైతులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. తయారు చేసిన మేతను వాడుకోవడం ద్వారా పాల దిగుబడి 2 నుంచి 3 లీటర్లు పెంచుకోవచ్చన్నారు. పొదుగువాపు వ్యాధి రాకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తద్వారా అధిక నష్టాన్ని అరికట్టవచ్చన్నారు. పుట్టిన దూడలకు 10రోజుల తరువాత నుంచి 6నెలల వ్యవధిలో పలు దఫాలుగా టీకాలు ఇవ్వడం వల్ల దూడలు ఆరోగ్యకరమైన ఆవులుగా ఎదుగుతాయని తెలిపారు. అనంతరం ఆత్మా అందించే కిలో మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. బాహ్య పరాన్న జీవులను అరికట్టే చర్యల్లో భాగంగా ఆవులకు పిడుదుల మందును స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఆత్మా బీటీఎం జ్యోత్స్న, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందిస్తున్న దృశ్యం

మదనపల్లెను ఎప్పటికీ మరువలేను

- ఆ మూడు ప్రాంతాలూ మూడుకళ్లు
- నా జీవితాన్ని తీర్చిదిద్దింది వారిద్దరే
- మదనపల్లె జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మదనపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'నాకు జీవితంలో అనుభవాలు, జీవిత పాఠాలు, సమాజం పట్ల బాధ్యతలు నేర్పిన మదనపల్లెను ఎప్పటికీ మరువలేను. నాకు మదనపల్లె ఎంత ముఖ్యమో రాజకీయ జన్మనిచ్చిన ధర్మవరం కూడా అంతే ముఖ్యం. మొదట నాకు అనుభవ పాఠాలు నేర్పిన మదనపల్లె నాకు ఒక కన్ను అయితే, జన్మనిచ్చిన పొద్దుటూరు రెండో కన్ను అని, ఇక ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రిగా ఆశీర్వదించిన ధర్మవరం మూడో కన్ను' అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. జననం, బాల్యం, విద్యాభ్యాసం, చివరకు రాజకీయ భిక్ష ప్రసాదించిన ఆ మూడు ప్రాంతాల జ్ఞాపకాలు, అనుభవాలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యార్థి దశలో పోరాటాలు నేర్పిన మదనపల్లె, ఇక్కడి స్నేహితులను పేరుపేరునా గుర్తు చేశారు. ఈ మూడు ప్రాంతాలను ఎప్పటికీ మరువలేనని చెప్పిన మంత్రి ప్రత్యేకంగా మదనపల్లెను ప్రస్తావిస్తూ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తూ ఇక్కడి రుణం తీర్చుకుంటానని ప్రకటించారు. మదనపల్లె సహా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రతిపల్లె, ప్రతి కుటుంబం తనకు తెలుసునని, ఇప్పటికీ వంద కుటుంబాల పేర్లు చెప్పగలనన్నారు. మరోవైపు మదనపల్లె పాలిటెక్నిక్ కళాశాల వేదికగా విద్యార్థి పరిషత్తు కార్యకర్తగా నక్సలిజంపై చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. మొదట్లో తాను పాలిటెక్నిక్ సత్యగా, తర్వాత పొద్దుటూరు సత్యకుమార్‌గా, ధర్మవరంతో సత్యకుమార్ యాదవ్‌గా గుర్తింపు పొందడాన్ని నమ్మలేకపోతున్నట్లు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. తనకు తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యార్థి దశలో బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, దేశ రాజకీయాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పరిచయం చేశారని తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా మదనపల్లె పేరును ప్రస్తావిస్తే, తాను ఉద్వేగానికి లోనవుతానని, అలాంటి స్థానం కల్పించినందుకు జీవితాంతం రుణపడి ఉంటానని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చల్లపల్లె నరసింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ఎన్.రమేష్‌నాయుడు, దినకర్, ఎన్.సేతు, గుత్తి హరికృష్ణ, జబ్బల శ్రీనివాసులు, టీడీపీ నేతలు రాటకొండ బాబురెడ్డి, కొహూరి మల్లికార్జుననాయుడు, నాదెళ్ల విద్యాసాగర్, గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, ఎంఆర్‌పీఎస్ నరేంద్ర, జంగాల శివరామ్, శ్రీరామ రామాంజనేయులు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల కూటమి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రిని నిర్మించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా నిర్మించాలని, అందుకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప, జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. శనివారం రాజంపేట నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సుండుపల్లె మండలం 15 గ్రామ పంచాయతీలతో సుమారు లక్షకు పైగా జనాభా కలిగి ఉందని, కానీ సరైన వైద్యం లేక సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అందుకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో లేకపోవడమేనని వివరించారు. 24 గంటలు సేవలు అందించే 30పడకల ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, బీజేవైయం జిల్లా నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు
- అధికారులు, ట్రేడర్స్, రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధరల నిర్ణయం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి నేతాజి సర్కిల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరాని కంటే మించి యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ట్రేడర్స్, రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధర నిర్ణయించబడుతుందని, బొప్పాయి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 44శాతం లోటు వర్షపాతం నమోదు అయిందని, దీని వల్ల 57 వేల హెక్టార్లకు గాను కేవలం 10600 హెక్టార్లల్లో సాగు చేస్తున్నారన్నారు. దీంతో 18శాతం మాత్రమే సాగువుతోందని సెప్టెంబర్ 6 నాటికి ప్రవేటు డీలర్ల వద్ద 518 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రంలో 460 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. 10600 హెక్టార్లు అనగా సుమారు 25 వేల ఎకరాలకు గాను ప్రస్తుతం అందుబాటులో ఉన్న 978 మెట్రిక్ టన్నుల యూరియా సరిపోతుందన్నారు. వచ్చే వారంలో 4000మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంఎస్ స్వామినాధన్ లాంటి వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించినట్లుగా రసాయనిక ఎరువులను అవసరానికి మించి వినియోగించడం వల్ల భూమి సారవంతం తగ్గుతుందన్నారు. జిల్లాలో 4000 మంది రైతులు 11వేల ఎకరాలల్లో బొప్పాయి పంట పండిస్తున్నారని, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో బొప్పాయి సాగు అధికంగా ఉందన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, చైర్మన్ రూపానందరెడ్డి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి 9 రూపాయలతో బొప్పాయి ధర నిర్ణంచారన్నారు. ఢిల్లీలో ఏ ధరైతే ఉంటుందో దానికి అనుగుణంగా ధర నిర్ణయించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ రైతులను రెచ్చకొట్టడం నేరమన్నారు. సోషియల్ మీడియాలో తప్పుడు కథనాలు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

పీలేరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం పీలేరు కోర్టు ఆవరణలో పీలేరు, కలకడ, భాకరాపేట, సదుం, రొంపిచెర్ల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో సివిల్, క్రిమినల్, మోటారు వాహన కేసులు, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ తదితర కేసులు పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు సహకరించాలని పిలుపునిచ్చారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమష్టి కృషితో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని, ఇందులో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని జడ్జి సూచించారు. సమావేశంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, కలకడ సీఐ లక్ష్మన్న, ఎస్ఐలు లోకేశ్, సుబ్బారెడ్డి, బాలక్రిష్ణయ్య, షేక్‌షావలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఓఈలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎల్‌ఎల్‌బీ (మూడేళ్ల, ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం సాయంత్రం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బీ (ఐదేళ్ల) మొదటిసెమిస్టర్ పరీక్షల్లో 50 శాతం మంది, ఎల్‌ఎల్‌బీ (మూడేళ్ల) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 17శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కెఎస్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.

బ్యూటీషన్, టైలరింగ్‌పై.. మహిళలకు ఉచిత శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 31 రోజుల పాటు టైలరింగ్, 35 రోజుల పాటు బ్యూటీపార్లర్ రంగంలో మహిళలకు ఉచితంగా ఇస్తున్నట్లు డైరెక్టర్ వి. అప్సర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు పైశిక్షణ కార్య క్రమాలకు అర్హులని, గ్రామీణప్రాంత మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలకు 9440905478, 9985606866, 94409 33028 నెంబర్లకు ఫోను చేసి తెలుసుకోవచ్చన్నారు. దూర ప్రాంతాలవారికి ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు.

వెల్లాల ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న బండి ఆంజనేయులు

రాజుపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం కడప జిల్లా సాయిపేటకు చెందిన బండి దేవకి, ఆంజనేయులు దంపతులు రూ.2లక్షలు విరాళం అందజేశారు. పాలకమండలి సభ్యులకు ఈచెక్కు అందించారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేసి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టుకు తగ్గిన కృష్ణాజలాల ప్రవాహం

కొండాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎన్‌ఎస్‌ఎస్ వరదకాలువ ద్వారా గండికోట ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో శనివారం నుంచి తగ్గినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇది వరకు సుమారు 11,000 క్యూసెక్కుల వరకు కృష్ణాజలాలు వస్తుండగా, ప్రస్తుతం 6,000 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. అదే విధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి వెళ్లే నీటిని 10,000 క్యూసెక్కుల నుంచి 5,000 క్యూసెక్కులకు తగ్గించినట్లు ఈఈ తెలిపారు. దీంతోపాటు సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు, కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 23.741 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

బాకీ పేరుతో బెదిరింపులు

- ఆగ్రహించిన వ్యాపారులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

యాడికి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారు... డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రాయలచెరువులో చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా శనివారం సాయంత్రం పలు దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు బాకీ వున్నారు, ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగాడు. పలు పెయింట్ షాపుల వద్దకు వెళ్లి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆగ్రహించిన షాపు యజమానులు అతడికి దేహశుద్ధి చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించాడని వ్యాపారులు ఆరోపించారు. విషయం పోలీసులకు సమాచారం తెలపగా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవి ?

- సంవత్సరాలు గడిచినా చర్యలు శూన్యం
- అనర్హత గల అధికారి పాత్రపై అనుమానం
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని అధికార యంత్రాంగం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో నిధులు పక్కదారి పడుతున్నాయి. సంవత్సరాలు గడిచినా అక్రమార్కులపై చర్యలు లేవు. జిల్లాలో పలుచోట్ల డ్వాక్రా సంఘాల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో కొన్ని చోట్ల అప్పటికప్పుడు ఆరోపణలు వచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగింది. అయితే భారీ స్థాయిలో నిధుల గోల్‌మాల్ జరిగి సంవత్సరాల కాలం దాటిపోతున్నా కేవలం ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం ఆ తరువాత ఆ విషయాన్ని మరుగున పడేశారు.

వల్లూరు మండలంలోని వెలుగు పథకంలో దాదాపు రూ.80లక్షల మేర అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టడమే కాకుండా కలెక్టరు సూచనల మేరకు థర్డ్ పార్టీ ఎంక్వయిరీ కూడా నిర్వహించారు. అయితే ఈ విచారణలో ఒక కమ్యూనిటీ కోఆర్డినేటరు తన సొంత ఖాతాకు నిధులు మళ్లించుకుని దుర్వినియోగానికి పాల్పడినట్లు వెల్లడైంది. అయితే అదే విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని నిధుల అక్రమాల్లో అప్పటి ఏరియా కోఆర్డినేటరు బి.సత్యనారాయణ పాత్ర ఉందని.. ఆయన చెబితేనే తాను నిధులు డ్రా చేసి తీసుకెళ్లి ఇచ్చానని ఆమె విచారణ అధికారికి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంటు ఇచ్చినట్లు సమాచారం.



డీఆర్‌డీఏ ఆఫీసు

అయితే ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏరియా కోఆర్డినేటరు అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేస్తుండడం వల్ల చర్యలు తీసుకోనట్లుగా స్పష్టమవుతుంది. అంతేకాకుండా గతంలో ఉన్న పీడీ కేవలం నోటీసులు ఇచ్చి సరిపుచ్చారనేది సమాచారం. అయితే రూ.80లక్షలకు పైగా నిధులు పక్కదారి పడితే కేవలం రూ.20లక్షలు మాత్రమే కమ్యూనిటీ కోఆర్డినేటరు పాత్ర ఉందని రికవరీ పెట్టారు.

మిగిలిన నిధులు ఏమైనట్లు?

వల్లూరు మండలంలో పక్కదారి పడుతున్న నిధుల్లో రూ.20లక్షలు కమ్యూనిటీ కోఆర్డినేటరు నుంచి వసూలు చేసేట్లు డీఆర్‌డీఏ అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కొంత మేర ఆమె నుంచి దశల వారీగా వసూలు చేసినట్లు తెలుస్తోంది., అయితే మిగిలిన మొత్తం ఎటు పోయినట్లు, ఏమైనట్లో అర్థం కాని పరిస్థితి. ఇంత కాలం అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వల్లూరు మండల సమాఖ్య ప్రతినిధులు కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ కేసులో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తాయని చర్చ జరిగింది. కానీ యథావిధిగా నిధుల దుర్వినియోగంపై మౌనమే రాజ్యమేలుతుంది. ఒక వల్లూరు మండలంలోనే కాకుండా అట్లూరు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వెలుగు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి నిధుల స్వాహాకు తెరలేపినట్లు ఆరోపణలు లేకపోలేదు. అయితే అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న సత్యనారాయణపై సెర్ప్ చర్యలకు ఉపక్రమించింది. అక్కడ కూడా ఇసుక క్వారీలో అక్రమాలు చోటు చేసుకోవడంపైనే చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో వల్లూరు మండలంలో ఆగిపోయిన విచారణ ఇక నుంచైనా ముందుకు సాగుతుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నమోదు కాని కేసు

వల్లూరు మండలంలో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని మండల సమాఖ్య సభ్యులు గతంలో వల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ అప్పట్లో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు జోక్యం చేసుకోవడంతో కేసు నమోదు చేయకుండా ఫిర్యాదు పక్కనపెట్టారు. తరువాత కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కేసు నమోదు కాని పరిస్థితి. జిల్లా కలెక్టరు చొరవ తీసుకుని ప్రభుత్వాలు మహిళాభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టే అంశంపై దృష్టిసారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ నిధుల దుర్వినియోగం, కేసు ఫిర్యాదులపై విచారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై కడప డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

క్షణికావేశంలో జీవితాలను పాడు చేసుకోవద్దు

- 5కే రెడ్ రన్‌లో యువతకు డీఎంహెచ్‌వో పిలుపు

కడప కలెక్టరేట్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసే తప్పిదాలతో మీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు యువతకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా శాఖల ఆధ్వర్యంలో యూత్‌ఫెస్ట్ 2025-26లో భాగంగా 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ 5కే రెడ్ రన్ మారథాన్ మహవీర్ సర్కిల్ నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు, అక్కడ నుంచి తిరిగి మహవీర్ సర్కిల్ వరకు సాగింది. కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతీ యువకులు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష తగదని అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు పేర్కొన్నారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌కు చికిత్స ఉందని, దీనిపై సందేహాలుంటే సమీపంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేసుకోవాలన్నారు. 5కే రెడ్ రన్ పోటీల్లో మొదటి బహుమతి సింహాచలం, రెండో బహుమతి సికిందర్‌లు గెలుపొందారు. అమ్మాయిల విభాగంలో శ్రీశకు ప్రథమ బహుమతి, రెండో బహుమతి కీర్తి, ట్రాన్స్‌జండర్ విభాగంలో మొదటి బహుమతి పింకి, రెండో బహుమతి మహేష్‌లు గెలుపొందారు. ఈసందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ విజేతలను అభినందించారు. జిల్లా క్రీడలశాఖాధికారి జగన్నాథరెడ్డి యువత ఆరోగ్యం, నైపుణ్యాలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ గురవయ్య, సుబ్బరాయుడు, రమేష్ వెంకటరెడ్డి, అమృత్, కళ్యాణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



5కే రెడ్‌రన్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫాతిమా కాలేజీ సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి 30 నుండి 35 సంవత్సరాలు వయసు ఉంటుందని, బ్లూకలర్ టీషర్టు ధరించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతున్ని ఎవరైనా గుర్తుపట్టి.. ఏదైనా సమాచారం ఉంటే 9440627658, 94409 00811కు ఫోను చేసికడప రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డికి తెలపాలన్నారు.

వ్యక్తిపై దాడి... పోలీసులకు ఫిర్యాదు

పులివెందుల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలమవారిపల్లెకు చెందిన రుత్విక్‌నాయుడు అనే వ్యక్తిపై నగరిగుట్టకు చెందిన రాజేష్‌తో పాటు మరికొంతమంది దాడి చేశారు. అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి అనే అతనితో తిరుగుతున్నాననే కారణంగా తనపై దాడి చేశారని రుత్విక్ నాయుడు ఆరోపించారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బాలికపై అత్యాచారం... యువకుడి అరెస్టు

- పోక్సో కేసు నమోదు

వేముల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యువకుడిని శనివారం పోలీసులు అరెస్టు చేసి.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఉలసయ్య, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. వారి వివరాల మేరకు... వేములకు చెందిన కుంచెపు వెంకట రమణ అనే యువకుడు ఇంటర్ మధ్యలో ఆపేసి బేల్దారి పనిచేసుకుంటున్నాడు. నాలుగు నెలల నుంచి ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. గత నెల 30వ తేదీ బాలికను బలవంతంగా తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉలసయ్య

కేవీకేకు నాలుగు అవార్డులు

సీకేదిన్నె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు నాలుగు అవార్డులు లభించినట్లు కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్ శనివారం తెలిపారు. తమిళనాడులోని వేలూరులో సెప్టెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన జోనల్‌స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు నాలుగు పురస్కారాలు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అందులో షెడ్యూలు కులాల ఉపప్రణాళిక పథకాన్ని విజయవంతంగా జిల్లాలో అమలుపరిచినందుకు ప్రథమస్థానం, జిల్లాలో అత్యుత్తమ ఫొటో విభాగంలో ప్రథమస్థానం, జిల్లాలో మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను విస్తరించినందుకు ప్రథమస్థానం, అపరాల ఆదర్శ గ్రామం పథకాన్ని విజయవంతంగా నడిపిస్తున్నందుకు మూడవస్థానం దక్కినట్లు తెలిపారు. ఈ పురస్కారాలను వ్యవసాయ సాంకేతిక అనే ప్రయోగ సంస్థ, జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ సమక్షంలో అందజేశారన్నారు. ఈ పురస్కారాలు రావడానికి కృషి చేసిన ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, విస్తరణ సంచాలకులు శివనారాయణ, పరిశోధన సంచాలకులు తులసిలకు అభినందనలు తెలిపారు. అదే విధంగా కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ అవార్డులు దక్కాయన్నారు.

గండిక్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు

రూ.4లక్షల ఆదాయం

చక్రాయపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండిక్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామిని దర్శించుకునేందుకు శనివారం భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో వివిధ ఆర్జితసేవల ద్వారా రూ.4,03,348 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, 1500 మంది అన్నప్రసాదంలో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, ఆదివారం చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 4గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తారన్నారు. తిరిగి సోమవారం 7గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.

పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలను అధిగమించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

కడప రూరల్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల రక్షణ చట్టాల అమలులో ఆయా శాఖల అధికారులు సమస్యలను అధిగమించి తద్వారా లక్ష్యసాధనకు పాటుపడాలని డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాదన్‌లో పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిపార్ట్‌మెంట్‌ల వారీగా సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. బాల్య వివాహాలు, గర్భదారణ, పిల్లల ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ పథకాలు, దూరప్రాంతాల పిల్లల సదుపాయాలు, తదితర అంశాలపై చర్చించారు. జేజేబీ చట్టం 2015, పోక్సో చట్టం 2012, పీసీఎంఏ 2006, బాల కార్మిక చట్టం 1986 తదితర చట్టాల గురించి తెలియపరిచారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, దివ్యాంగన్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456 తెలియపరిచారు. సమావేశంలో ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కె.భార్గవి, కడప జిల్లా డీఆర్‌వో, కడప, అన్నమయ్య జిల్లాల ఏఎస్‌పీలు, డీఎంహెచ్‌వో, సోషల్‌వెల్ఫేర్, లేబర్ డిపార్ట్‌మెంట్, సర్వశిక్ష అభియాన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- కలెక్టరుకు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి వినతి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందిస్తున్న శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. శనివారం కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి ఆ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల నుంచి పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీని సకాలంలో అందజేయాలన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కుడా)నిధులు విడుదల చేయాలన్నారు. నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయన్నారు. గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని.. కనీసం పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నా నిధులు లేవన్నారు. సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు సహకరించాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా రహదారుల అభివృద్ధి

- రహదారులు, భవనాలశాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి

కడప రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తున్నారని... అందుకు అనుగుణంగా అధికారులు పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని రహదారులు, భవనాలశాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ మేరకు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల కురిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు, వాటి అంచనా విలువపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలను పంపాలని ఆదేశించిందన్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి కడప జిల్లాలోని వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాంలో రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నా వెంటనే పనులు చేపట్టేందుకు ప్రణాళికలను తయారు చేసి పంపాలన్నారు. నిధులు మంజూరు కాగానే ప్రాదాన్యత క్రమంలో ఖర్చు చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎస్‌ఈ వై.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వర్షాలకంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు, లేయర్లకు సంబంధించి వైఎస్‌ఆర్ కడప జిల్లా నుంచి రూ.235 కోట్లు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట డివిజన్‌కు సంబంధించి రూ.37 కోట్ల మేర ప్రతిపాదనలను పంపామని తెలిపారు.

రహదారుల పరిశీలన

జిల్లాలోని పలు రహదారులను రహదారులు భవనాల శాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చింతకొమ్మదిన్నె మండలంలోని ఎన్టీపీసీ నుంచి కడప నగరం 18వ డివిజన్‌లోని విశ్వనాథపురం రైల్వే గేటు వరకు ఉన్న ఆర్‌అండ్ బీ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ టక్కోలి కృష్ణారెడ్డి, 17వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయకులు ఎం. మునీంద్రయాదవ్, స్థానిక నాయకులు కలిసి ఈ రహదారి పనులకు రూ.12 కోట్లతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని త్వరలో నిధులు మంజూరు చేసి పనులను ప్రాంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఈ వై.నాగేశ్వరరెడ్డి, డీఈ కళ్యాణి, శేషావలి, తదితరులు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె మండలం ఎన్టీపీసీ నుంచి విశ్వనాథపురం వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు వివరాలను ఈఎన్‌సీ వివేకానందరెడ్డికి తెలియజేస్తున్న టీడీపీ నేతలు

స్మార్ట్ కిచెన్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలాల్లో స్మార్ట్ కిచెన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలో అన్ని మండలాల్లో స్మార్ట్ కిచెన్‌ల నిర్మాణాల అంచనాలు, టెండర్లు, మెటీరియల్ సంబంధిత అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ వీసి కార్యక్రమంలో నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడప,జమ్మల మడుగు,చింతకొమ్మిదిన్నె మండలాల్లో స్మార్ట్ కిచెన్‌లను విజయవంతంగా ప్రారంభించడం జరిగిందన్నారు. ఈకార్య క్రమంలో ఆగ్రోస్ డీఎం జోయల్ విజయ్ కుమార్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మీ, డీఈవో షంషుద్దీన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి,సీపీవో హజరత్తయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఈ మద్దన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

యాప్‌లపై అవగాహన పెంచుకోవాలి

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు మైథిలీ అన్నారు. చెన్నూరులో శనివారం డీడీవో ఇంటింటా తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లపై ఎలాంటి అవగాహన ఉంది. వాటిని ఉపయోగించు కుంటున్నారా లేదా, యాప్‌లలో వచ్చే పథకాలు తెలుసుకుంటున్నారా...లేదా అన్న అంశంపై ప్రజలను అడగడం జరిగింది. అలాగే యాప్‌లు ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, వాటిని ఎలా వినియోగించుకోవాలి,వాటి గురించి తెలుసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై డీడీఓ తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో 2021 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధి పనులు, మండల వ్యాప్తంగా ఏ ఏ గ్రామ పంచాయతీలో ఎన్ని జరిగాయి, ఎంత నిధులు ఖర్చు పెట్టారు. అందుకు సంబంధించి జనరల్ ఫండ్, 15వ ఆర్థికసంఘం నిధులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో కిరణ్‌మోహరావు, ఏవో గంగాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

కడప క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ర్యాపిడో‌రైడర్స్‌ను సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు మధుమల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా ఉండే విధానంపై సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు ఆధ్వర్యంలో పాతబస్టాండు వద్ద శనివారం అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం సంబంధిత పోస్టర్లను రద్దీ ప్రదేశాల్లో గోడలకు అతికించారు.

రోడ్డు కోసం మహిళల ఆందోళన

కడప సెవెన్ రోడ్స్‌సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 11వ డివిజన్ పరిధిలోని మృత్యుంజయకుంటలో శివాలయం వెనుక ఉన్న రామాలయం వీధిలో సిమెంట్ రోడ్డును తక్షణం నిర్మించాలని 11వ డివిజన్ సీపీఐ నాయకురాలు వడ్ల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం డివిజన్ సచివాలయం వద్ద స్థానిక మహిళలతో కలిసి ధర్నా చేశారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జనరల్ ఫండ్ కింద, 15వ ఫైనాన్స్ నిధుల కింద రోడ్డు, డ్రైనేజీ కాల్వ మంజూరైనప్పటికీ నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణం రోడ్డు, డ్రైనేజీకాల్వను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ,మల్లిక, పెంచలమ్మ, ఉమాదేవి, గంగమ్మ, వరలక్ష్మి, రమణమ్మ, సుకన్య పాల్గొన్నారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్

కడప క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పాఠశాలలు,కళాశాలల్లో శక్తియాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తియాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీం మహిళా ఎస్ఐ శాంతమ్మ తెలిపారు. ఈ యాప్ ప్రాముఖ్యత,దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై కడప నగరంలోని రిమ్స్ నర్సింగ్ విద్యార్థినుల వసతిగృహంలో శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ హాస్టల్ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటరు శివకుమారి, హాస్టలు వార్డెన్ వి.సంధ్యారాణి, నర్సింగ్ విద్యార్థినులు, శక్తిటీం సిబ్బందిపాల్గొన్నారు.

'పులివెందుల మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి'

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ పేరుతో కూటమి సర్కారు కుట్ర పన్నుతోందని పులివెందుల మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్‌కు కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమాల్ బాషా, జవహర్, రంతుల్లా హరిప్రసాద్ తదితరులున్నారు.

వామపక్షాల నిరసన



కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో దిగుమతి సుంకం పెంపు ప్రభావం భారతదేశ వ్యవసాయ అనుబంధ ఆక్వా, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. వామపక్షాలు చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, ఆర్ఎస్‌పీ సెల్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావంపడిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు వెంకటశివ, సీపీఎం నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన నాడు-నేడు పనులు

● అసంపూర్తిగా పాఠశాల భవనాలు

సీకేదిన్నె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నాడు-నేడు పనులు పూర్తికాకముందే ప్రభుత్వం మారడంతో ఆ పనులు సగంలో నిలిచిపోయాయి. దీంతో ఆ భవనాలు ఎటూ కాక మధ్యలో ఆగిపోయాయి. దీంతో అనుకున్న ప్రయోజనం నెరవేరకపోగా విద్యార్థులకు ఇబ్బంది కలిగించే విధంగా తయారయ్యాయి.

● నిలిచి పనులు..: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాడు-నేడు కింద ప్రారంభించిన పనులను ఆపివేశారు. దీంతో సగం వరకు జరిగిన పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఆ భవనాలు ఎటూ ఉపయోగపడక అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా విద్యార్థులు ఆ భవనాల పైకి వెళితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

● **రూ.కోటితో పనులు..:** మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులు హైస్కూలులో కలుపడంతో ఇందుకు అవసరమైన భవనాల నిర్మాణం కోసం తొమ్మిది గదులకు కోటి రూపాయలు నిధులు విడుదల చేయడం జరిగింది. అయితే ప్రస్తుతం ఆరు గదులు నిర్మించి అవి కూడా అసంపూర్తిగా ఆగిపోయాయి. దీంతో భవనాలు ఉపయోగించుకోలేక అక్కడ ఎటువంటి పనులు జరుగక నిరుపయోగంగా ఉన్నాయి.



చింతకొమ్మదిన్నెలో అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనాలు

● **ప్రభుత్వం నిర్ణయం మేరకే...**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాల భవనాలకు నాడు-నేడు పనులను నిలిపివేయమన్నారు. దీంతో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే తిరిగి ఆ భవనాలను ప్రారంభిస్తాం.

- శోభారాణి, ప్రధానోపాధ్యాయురాలు

అన్నదాతలకు రుణాలు అందజేత

వల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వల్లూరులో ఉన్న వవసాయ సహకార పరపతి సంఘం ద్వారా శనివారం రైతులకు దాదాపు రూ.90లక్షల దీర్ఘకాలిక రుణాలు పంపిణీ చేసినట్లు సహకార సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సహకార బ్యాంకులో 15 మంది రైతులకు రుణాలను అందించారు. గత ఏడాదిగా నిలిచిన ఈ రుణాలను ఎమ్మెల్యే చొరవతో తిరిగి రుణాలను అందిస్తున్నట్లు నాగేశ్వర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సూపర్‌వైజరు రామచంద్ర, డైరెక్టరు శివారెడ్డి, అన్నదాతలు పాల్గొన్నారు.

నేత్రదానంతో పదిమందికి వెలుగు

వేంపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడం వల్ల పదిమందికి కంటిచూపునిస్తారని తాళ్లపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆప్తాలమిక్ అధికారి డాక్టర్ రెడ్డయ్య తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి,ఝాన్సీసీహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు అరుణదేవి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

18బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలోని పాలెంపల్లె వద్ద ఉన్న చంద్రశేఖరరెడ్డి గోడౌన్‌లో అక్రమంగా రవాణా కోసం నిల్వ ఉంచిన 18బస్తాల పీడీఎస్ బియ్యాన్ని సీఐ క్రిష్ణారెడ్డి దాడి చేసి పట్టుకున్నారు. ప్రజలకు పంచాల్సిన బియ్యాన్ని ఇలా అక్రమం గా నిల్వ ఉంచి రవాణా చేయడం నేరమని, స్వాధీనం చేసు కున్న బియ్యంతో పాటు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'రైతుల పక్షాన వైసీపీ పోరుబాట'



మాట్లాడుతున్న అంజాద్ బాష

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై వైసీపీ పోరుబాటకు పిలుపు నిచ్చినట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష తెలిపారు. శనివారం కడప నగరం అంజాద్ బాష క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పట్లచిన్నచూపు చూస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా ఒక్క వ్యవసాయ పథకం కూడా అమలు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 9న రైతులకు అండగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు యానాదయ్య, ప్రసాద్‌రెడ్డి, ఆదిత్య, కార్పొరేటర్ షంషీర్, బంగారు నాగయ్య, దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల, జేఏసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ పింఛనర్స్, ఉద్యోగుల ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఈనెల 13వ తేదీన తుమ్మలపల్లె కళాక్షేత్రం విజయవాడలో జరిగే రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలో ఉండే బీసీ ఉద్యోగులందరూ తరలిరావాలని బీసీ పింఛనర్స్, ఉద్యోగుల ఉపాధ్యాయుల జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ఎస్.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం కడప జిల్లా ఎస్‌టీయూఫ్ జిల్లా కార్యాలయంలో వారాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాల్వల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. శనివారం కడపనగరం మార్నింగ్ విద్యుత్‌లో భాగంగా 38వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. రోడ్డుపై చెత్త తొలగించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాత బస్టాండ్ అన్నక్యాంటీన్‌ను సందర్శించారు.

ఘన జీవామృతంలో అధిక పోషకాలు

లింగాల,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఘన జీవామృతంలో అధిక పోషకాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కులగారిపల్లె గ్రామంలో శనివారం ఘనజీవామృతం తయారుచేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. 200కేజీల పేడ, 10లీటర్ల మూత్రం, పుట్టమట్టి, ఘన జీవామృతం తయారీకి అవసరం అవుతాయని వివరించారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఘన జీవామృతం తయారుచేస్తున్న అధికారులు

హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. హాస్టల్లో ప్రధానంగా నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేస్‌యాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ వైవీయూ అధ్యక్షుడు భరత్‌సింహ, ఆర్ఎస్ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పరిశుభ్రత పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

సింహాద్రిపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పరిశుభ్రత పాటించేందుకు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ ఓబుళమ్మ పేర్కొన్నారు. శనివారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, పులివెందుల డీఎల్‌డీఓ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, వాటిపై ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డితో ఆరా తీశారు. అనంతరం స్వచ్ఛాంధ్రలో భాగంగా సింహాద్రిపురం వీధులలో పర్యటించి పరిశుభ్రతను పరిశీలించారు. సింహాద్రిపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు

చికిత్స కోసం కర్నూలుకు తరలింపు

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న మాచుపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగనపల్లె ఓబులేసు (35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెండ్లిమర్రి మండలం మొయిళ్లకాల్వకు చెందిన ఈయన వ్యక్తిగత పనుల నిమిత్తం ఖాజీపేటకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చిన్నమాచుపల్లె వద్ద ఖాజీపేట వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. దీంతో ఆయన రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి అక్కడ వైద్యుల సూచనలు, సలహాల మేరకు మెరుగైన,చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అలాగే గాయపడ్డ వ్యక్తి చిన్నాన్న రాజేశ్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘాట్‌లో యథావిధిగా రాకపోకలు



ట్యాంకర్‌ను క్రేనుతో తొలగిస్తున్న దృశ్యం

సీకేదిన్నె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రాయచోటి వైపు నుంచి వచ్చే ట్రాన్స్‌పార్మర్ ఆయిల్ ట్యాంకర్ రాత్రి మూడో మలుపు దిగుతూ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ట్యాంకర్ నుంచి ఆయిల్ రోడ్డుపై పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తొలగాయి. రాత్రంతా ప్రయత్నించినప్పటికీ ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు వీలుకాలేదు. శనివారం ఉదయం నుంచి కొద్దికొద్దిగా ట్రాఫిక్ క్లియర్ చేస్తూ మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్తిగా ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. వాహనాలు జారకుండా రోడ్డుపై డస్ట్ వేశారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేయడమే

వేంపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేయడమేనని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఎన్ఎస్ఎస్ 2,8వ యూనిట్‌ల ఆధ్వర్యంలో రక్తదాన అమృత మహోత్సవ కార్యక్రమం శనివారం ట్రిపుల్‌ఐటీలో నిర్వహించారు. రక్తదానానికి సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. హ్యాండ్ ఫర్ యూ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుబ్బారావు విద్యార్థులకు, సిబ్బందికి రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యానందరామ్, దీప్తి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె



సమ్మెలో భాగంగా ర్యాలీ నిర్వహించి నినాదాలుచేస్తున్న పారిశుధ్య కార్మికులు

వేంపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్య కార్మికుల సమ్మెకొనసాగుతోంది. శనివారానికి మూడో రోజుకు చేరుకుంది. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో పూటగడవడం లేదంటూ పనులు నిలిపివేసి సమ్మెకు దిగారు. అయినా అధికారులలో ఏమాత్రం చలనం లేకపోవడంతో శనివారం నిరసనను కొనసాగించారు. పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీరోడ్డు మీదుగా నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. తమ జీతాల నుంచి తీసుకున్నపీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ గోడును పట్టించుకోవాలని అధికారులకు విన్నవించారు. సమస్య పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని పారిశుధ్య కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు తాగునీటి సరఫరా సిబ్బందికి 5,6 నెలలుగా వేతనాలు అందక కష్టాలలో సమ్మె చేస్తున్నారని తక్షణం వేతనాలు ఇవ్వాలని శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని పంచాయతీ కార్యాలయంలో ఏఓ ఖాదర్‌బాషకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లా కార్యదర్శి జి.మద్దిలేటి, నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కడప కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు నందమూరి బాలక్రిష్ణ తనయుడు మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా బాలక్రిష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమీప ప్రేమాలయ అనాథ శరణాలయంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలక్రిష్ణ అభిమాన సంఘం జిల్లా, నగర అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, సుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, బాలకృష్ణ అభిమానులు బి. రమణ, చికెన్ బాష, ప్రసాద్‌నాయుడు, గంగాధర్ అభిమానులు పాల్గొన్నారు

కంపచెట్ల నడుమ రైతు సేవాకేంద్రం



చెన్నూరు 1వ వార్డులో కంపచెట్ల మధ్య రైతు సేవాకేంద్రం

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు 1వ సచివాలయ పరిధిలోని రైతు సేవాకేంద్రం కంపచెట్ల నడుమ దర్శనమిస్తోంది. ఈ రైతు సేవాకేంద్రాన్ని చాలాకాలంగా నిరుపయోగంగా ఉంచడంతో చుట్టూ పలు రకాల పిచ్చిమొక్కలు పెరిగాయి. అందులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పైగా మండల కేంద్రంలో ఉన్నప్పటికీ గ్రామంలోనే ఒక మూలగా ఉండడంతో రైతులకు అవసరమైన ఎరువులను అక్కడ తీసుకువచ్చి నిల్వ ఉంచాలన్నా, పంపిణీ చేయాలన్నా ఇబ్బందికరంగా ఉండడంతో దాన్ని ఏ అవసరానికీ ఉపయోగించడంలేదు. ఫలితంగా 1వ వార్డు రైతు సేవాకేంద్రం దిక్కులేనిదిగా ఒక మూల పడి ఉండి నిరుపయోగంగా ఉండటంతో పలురకాల మొక్కలు కంపచెట్లు పెరిగాయి. అధికారుల దృష్టికి వచ్చిందో లేదో తెలియదు మరి.

ఆరోగ్య ఉప కేంద్రానికి జబ్బు



ఉపకేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తూర్పువీధిలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి జబ్బు చేసినట్లుగా ఉంది. దీన్ని ఉపయోగిస్తున్నరో లేదో తెలియదు. చుట్టు పలు రకాల చెట్లు పెరిగి కనీసం దారి కూడా లేకుండా ఉంది. పలు రకాల మొక్కలు ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ ఉన్నాయి. ఒక్కో సమయంలో చుట్టుపక్కల వారు మేకలు, పొట్టేళ్లు ఈ ఉప కేంద్రం గ్రిల్‌కు కట్టేసి పోతుంటారు. అవి విసర్జించిన పేడ తదితరాలు అక్కడే ఉన్నాయి. ఎప్పుడు తెరుస్తారో లేదో తెలియదు కానీ ఉప కేంద్రానికి వెళ్లేందుకు మాత్రం ప్రస్తుతానికి అయితే ఎలాంటి వీలు లేకుండా ఉంది. సంబంధిత వైద్యసిబ్బంది స్పందించి వీటిని శుభ్రం చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మనసును అదుపులో పెట్టుకోవాలి

వేంపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మనసును మెదడు ద్వారా అదుపులో ఉంచుకోవాలని విజయవాడకు చెందిన సైకాలజిస్ట్, వ్యాఖ్యాత హరి తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాఖ్యాత హరి మాట్లాడుతూ మనసును అదుపులో పెట్టుకోకపోవడం వల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. తల్లిదండ్రులు, గురువులుచెప్పిన మాట వింటే జీవితంలో రాణిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై అవగాహన



కడపపాత బస్టాండు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామక్రిష్ణ, ఎస్ఐ అమర్‌నాథరెడ్డి

కడప క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పోలీసు అధికారులు మాట్లాడుతూ రోడ్డుభద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. వాహనదారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వాహనాల్లో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వాహనాలు వేగంగా నడపరాదన్నారు. లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

బి.మఠానికి బస్టాండు ఎప్పుడో..?

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక కేంద్రం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం మండలానికి బస్టాండ్ ఎప్పుడోనంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారు. గతంలో బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సెంటరులో పురాతన బస్‌షెల్టరు ఉండేది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు వెడల్పు చేసే క్రమంలో ఆ బస్‌షెల్టరు తొలగించి నూతనంగా ఏర్పాటు చేద్దామని చెప్పి మాటతప్పారు. దీంతో దాదాపుగా నాలుగు సంవత్సరాలు ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీ మద్విఆరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి సజీవసమాధి నిష్ఠ వహించిన ఆధ్యాత్మిక కేంద్రానికి బస్టాండు లేక రాష్ట్ర నలుమూలల నుంచి స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు తీవ్ర ఇక్కట్లుపడుతున్నారు. తమ వాహనాలను ఎక్కడ నిలబెట్టుకో వాలి, ప్రయాణం చేసేటప్పుడు ఎక్కడ వేచి ఉండాలన్న విషయంపై భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఇటీవల వర్షాకాలంలో యాత్రికులు, భక్తులు బస్టాండ్ లేక చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ రూ.10 లక్షల వ్యయంతో తాత్కాలిక బస్ షెల్టరు నిర్మాణాన్నిచేపట్టాలని స్థానిక టీడీపీ నేతలకు తెలిపినప్పటికీ వారు బస్‌షెల్టరు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఇదలా ఉంటే వానకు, ఎండకు భక్తులు రోడ్లపైనే బస్సుల కోసం గంటల తరబడి నిలబడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదిలా ఉం టే గత పది సంవత్సరాలక్రితం బ్రహ్మంసాగర్ వెళ్లే మార్గమధ్యంలో ప్రభు త్వ స్థలం ఏడు ఎకరాలకు పైగా ఉండగా అందులో శాశ్వతంగా బస్టాండు నిర్మాణాన్ని చేపడితే బాగుంటుందని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రణాళికలను రూపొందించారు. అయితే దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆ స్థలంలో బస్టాండునిర్మాణ పనులు చేపట్టలేదు. ప్రస్తుతం మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్రహ్మంగారిమఠానికి బస్టాండు నిర్మాణ పనులు రావచ్చని యాత్రికులతోపాటు స్థానిక ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. ప్రభుత్వ స్థలం రోజురోజుకూ ఆక్రమణకు గురవుతూ ఉందని, వెంటనే గతంలో కేటాయించిన ఆ స్థలంలో శాశ్వతంగా బస్టాండున నిర్మాణ పనులు చేపట్టి ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠానికి బస్టాండును ఏర్పాటు చేయాలని లేకుంటే ఆస్థలం కూడా కబ్జాదారుల కబంధహస్తాల్లోకి వెళితే ఇబ్బందులు ఏర్పడుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బస్టాండ్ నిర్మాణానికి చొరవచూపాలని కోరుతున్నారు.



బస్టాండ్ లేక బస్సుల కోసం రోడ్లపై వేచి ఉన్న భక్తులు

13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి

జమ్మలమడుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈనెల 13వ తేదీ నిర్వహిస్తున్నందున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులకు జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్జి మాట్లాడుతూ జమ్మలమడుగు కోర్టు పరిధిలో అన్ని పోలీసు స్టేషన్లకు సంబంధించి పోలీసు అధికారులు కేసులపై శ్రద్ధపెట్టాలన్నారు. ఎక్కడైనా గొడవలు జరిగి ఉన్నా ఇతరత్రా కేసులకు సంబంధించి రాజీ మార్గంలో వారిని ఒప్పించి జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన సూపర్-7 క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4వ సూపర్-7 అండర్-23 యూత్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 11 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్‌యాదవ్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రికెట్‌లో సాధన చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ క్రికెట్‌క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్‌రెడ్డి, అనిబిసెంట్ హైస్కూలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, రాష్ట్ర సూపర్-7 క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్ర, అసోసియేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి కిరణ్, అన్నమయ్య జిల్లా కార్యదర్శి మురళి, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ కోసం వీధి కుక్కల తరలింపు

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : వ్యాక్సిన్ కోసం వీధి కుక్కలను ప్రొద్దుటూరు వైద్యశాలకు శనివారం తరలించినట్లు మైదుకూరు కమిషనర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలను వ్యాక్సిన్, ఆపరేషన్ లాంటి వైద్య పరీక్షల నిమిత్తం ప్రొద్దుటూరు పశువుల వైద్యశాలకు ఆటోలో వీధి కుక్కలను తరలించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



చెక్కభజన మధ్య నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

జమ్మలమడుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమగులో శనివారం వినాయక విగ్రహాన్ని వైభవంగా చెక్కభజన మధ్య నిమజ్జనానికి తరలించారు. ఈనెల 27వ తేదీ నుంచి జమ్మలమడుగులో పలుచోట్ల వినాయక విగ్రహాలు కొలువుదీర్చారు. కొలువైన వినాయక మండపాల నుంచి చెక్కభజన మధ్య రాత్రి భక్తుల సందడి నెలకొంది. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా, అలాగే కన్నెలూరులో కొలువైన వినాయక విగ్రహాల మండపాల నుంచి మెరువణిగా శనివారం రాత్రి నిమజ్జనంచేశారు.

బ్రహ్మంగారిమఠంలో : మండలంలోని వీర నారాయణపురం గ్రామంలో అభయ విఘ్నేశ్వరస్వామి వారిని ఘనం గా నిమజ్జనం చేశారు. పదిరో జుల పూజా కార్యక్రమాలు చేసి 11వ రోజు శనివారం గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వాహకులు గ్రామోత్సవాన్ని చేపట్టి అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల ఎంపీజే కమిటీ ఎంపిక

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో ఎంపీజే నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర బాధ్యులు ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని ఇచ్చారు. ముద్దనూరు రోడ్డులోని జామియా మసీదులో శని వారం జరిగిన కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయుబ్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రిలు పాల్గొని ఈ కమిటీని ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు కమాల్ బాషా తెలిపారు. అధ్యక్షుడుగా షేక్ కమాల్‌బాషా, ఉపాధ్యక్షుడుగా షేక్ మహమ్మద్ జుబేద్, సెక్రటరీగా షేక్ మహమ్మద్ షరీఫ్, జాయింట్ సెక్రటరీలుగా షేక్ మునీర్ అహమ్మద్, షేక్‌చాంద్‌బాషా, ట్రెజరర్‌గా షేక్ బికారిసాబ్‌లు ఎంపికైయ్యారు. అలాగే 14మంది సభ్యులను ఎంపిక చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రాజగోపాల్ హెచ్చరించారు. శనివారం స్థానిక రాజీవ్ సర్కిల్లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ద్విచక్రవాహనాలు గానీ ఆటోలు గానీ వేగపరిమితితో నడపాలన్నారు. రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. ప్రతి ఆటో డ్రైవరు తప్పని సరిగా వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయనలో: రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే వాహనదారులపై చర్యలు తప్పవని కాశినాయన మండల ఎస్ఐ యోగేంద్ర పేర్కొన్నారు. శనివారం ఓబులాపురం మూడు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈసందర్భంగా సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానాలు విధించారు.

పేదల అభ్యున్నతికే నమస్తే కార్యక్రమం

బద్వేలు, సెప్టెంబరు 6, (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఉన్న దిగువ మధ్యతరగతి కుటుంబాల వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమస్తే కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్, చెత్త తదితర పదార్ధాలను సేకరించి వ్యాపార చేసుకునే వ్యక్తులకు ఈ పథకం వర్తిస్తుందని,సూచించారు.ఈ కార్యక్రమం జిల్లాలో మొదటిసాగా బద్వేలులో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

విద్యార్థులకు అర్థవంతమైన భోదనచేయాలి

కాశినాయన సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థవంతమైన బోధనను అందించాలని ఎంఈవో-2 నిర్మల పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిద్దెల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు.అనంతరం తరగతి గదులకు పోయి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



ప్రధాని, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రాయల్ సేవా సమితి సభ్యులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా బలిజ సామాజికవర్గానికి చెందిన నారిశెట్టి సుప్రజ ఎన్నికైనందుకు రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పోరుమామిళ్లలో శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వారు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సామాజిక వర్గానికి చెందిన నారిశెట్టి సుప్రజను బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా ఎన్నిక చేయడం ఎంతో సంతోషంగాఉందన్నారు. తమపై ఎంతో నమ్మకంతో బీజేపీ అధిష్టానం, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో రుద్రవరం వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, నరేశ్, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వెనుకవైపు ఉన్న పోతరాజు స్వామి ఆలయం చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలని శివశక్తి జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి తెలిపారు. శివశక్తి సభ్యులు శనివారం ఆలయం వద్ద ఆక్రమణలు తొలగించాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోతరాజు ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసేవారని ప్రస్తుతం ఆలయం చుట్టూ దుకాణాలు వెలిశాయని అలాగే ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో భక్తులకు ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు స్పందించి ఆలయం చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు నాగార్జున, గోసంరక్షణ సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకధార నరేంద్రరావు, ధనుంజయరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు అభినందనలు



అవార్డులు అందుకున్న వారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బద్వేలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి)॰ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విశిష్ట సేవలందించి ఉపాధ్యాయ దినోత్సవం నాడు కలెక్టర్, ఎమ్మెల్సీల చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాల తెలుగు ఉపాధాయుడు శివ ప్రసాద్, పీఈటీ బాలయ్య సేవలను ప్రభుత్వం గుర్తించడం అభినందనీయమన్నారు. ఇలాంటి విజయాలు వారు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతరెడ్డి రామచంద్రారెడ్డి, అనిషా బేగం, మేకల రామసుబ్బయ్య పాల్గొని అవార్డులు పొందిన వారిని అభినందించారు.

బ్రహ్మంగారిమఠంలో : స్థానిక కందిమల్లయ్య పల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు తుపాకుల శ్రీనివాసులుకు జిల్లాఉత్తమ ఉపా ధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో బి.మఠం మండల ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు శేషయ్య, కార్యదర్శి పత్తి సురేశ్, కోశాధికారి బింగి సురేశ్‌లు పాల్గొన్నారు.



బి.మఠంలో శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

బి.కోడూరులో : మండల పరిధిలోని మేకవారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామక్రిష్ణ ఆధ్వర్యంలో 37 ఏళ్లుగా ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బ్రహ్మయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కలిసి ప్రధానోపాధ్యాయుడు తులసి రామక్రిష్ణను సన్మానించారు. జనవిజ్ఞానవే దిక రాష్ట్ర నాయకుడు దేవదత్తం, మోడల్ స్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రామాంజనేయ రాజు, శాంతకుమారి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి అన్నారు. శనివారం స్థానిక సీడీపీవో కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల అంగన్వాడీ వర్కర్లు, హెల్పెర్స్ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభల్లో ప్రాజెక్టు అధ్యక్షురాలిగా వినోదాదేవి, వర్కింగ్‌ప్రెసిడెంటుగా దస్తగిరమ్మ, ప్రధాన కార్యద ర్శిగా మేరీ, ఉపాధ్యక్షులుగా ఓబులాపురం విజయమ్మ, జ్యోతమ్మలతో పాటు 16 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భైరవ ప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

పొదుపు నిధుల స్వాహాపై చర్యలుతీసుకోండి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రామహిళలకు సంబంధించి పొదుపు డబ్బులు స్వాహా చేసిన యానిమేటరుపై అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మొఘల్ చిన్నరంతుల్లా కోరారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోరుమామిళ్లలో ఓ వీధిలో 20 సంవత్సరాలుగా పొదుపు చేసుకుంటున్న సభ్యుల వద్ద నుంచి దాదాపు రూ.3ల క్షలు స్వాహా చేస్తే ఆమెపై చర్యలు తీసుకోవడానికి అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోరిచారు. ఈ విషయం ఏపీయం దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

ఎక్కడా యూరియా సమస్య లేదు : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ, అధికారులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో ఎక్కడ కూడా యూరియా సమస్య లేదని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ వ్యవసాయ టెక్నికల్ అధికారి సుశ్మిత వెల్లడించారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో యూరియా సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం వరిసాగు చేసిన రైతాంగానికి యూరియా అందకపోతే వెంటనే రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తెలియజేయాలన్నారు. అక్కడ సమస్య ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు వరి సాగు చేసిన రైతాంగానికి యూరియా ఇబ్బందులు లేవన్నారు. ప్రొద్దుటూరు వ్యవసాయ టెక్నికల్ ఏవో సుశ్మిత మాట్లాడుతూ జమ్మలమడుగు సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు యూరియా 519 టన్నులు సరఫరా జరిగిందని, 501 టన్నులు రైతులకు అందజేయడం జరిగిందని, 16 టన్నులు ప్రైవేటు షాపుల వద్ద నిలువ ఉందని ఎక్కడ సమస్య లేదన్నారు. అలాగే మరికొంత రైతు సేవా కేంద్రాల వద్ద ఉంచడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాల్లో రైతులకు యూరియా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. ఇప్పటికే రైతులు రెండుసార్లు యూరియా ఉపయోగించారన్నారు.ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి అవసరమైన వారు తీసుకెళ్లాలన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు యూరియా సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మందుల దుకాణాల వారు సమస్యను సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ నరేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కోడిగాండ్ల పల్లెలో వైద్యశిబిరాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత

ముద్దనూరు సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారిణి గీత ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని కోడిగాండ్లపల్లెలో లార్వా, ఫీవర్స్ సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత ఆకస్మిక తనిఖీ చేసి గ్రామంలో పర్యటించారు. ఇళ్ల వద్ద పారిశుధ్య లోపం లేకుండా జాగ్రత్త వహించాలని ప్రజలకు సూచించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండండి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలు వందశాతం ఉండేలా చర్యలు చేపట్టడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆరోగ్య సిబ్బందికి సూచించారు.ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆర్‌సీహెచ్(తల్లి, బిడ్డ) ప్రొగ్రాంను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా గర్భిణుల నమోదు, కాన్పులు, వ్యాధినిరోధక టీకాలు తదితర వాటి పై ఆరాతీశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ అధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్ కరీష్మా, కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్‌యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి,ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మగౌరవం దెబ్బతీసే పనులు చేయం



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆత్మగౌరవం దెబ్బతీసే పనులు సచివాలయ ఉద్యోగులు చేయరని గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా జెఏసీ కన్వీనర్ మస్తాన్, కోకన్వీనర్ నాగార్జునలు స్పష్టం చేశారు. శనివారం స్థానిక సచివాలయ ఉద్యోగులు మన మిత్రా సేవలు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు డ్వాక్రా మహిళలు చేసే పనులు సచివాలయ ఉద్యోగులు చేయమనడం సరైందికాదన్నారు. గ్రామ వార్డు సచివాలయ శాఖను రద్దు చేసి మాతృశాఖలో విలీనం చే యాలన్నారు. గతంలో 50 ఇళ్లకు ఒక వాలంటీరు వుంటే ఇప్పడు ఒక్కోక్క సచివాలయ ఉద్యోగికి 150 ఇళ్లలు కేటాయించి ఒత్తిడి పెంచుతున్నారన్నారు,.. అనంతరం కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల నేతలు శేఖర్‌రెడ్డి, ఓంకారం, కుమార్‌రెడ్డి, హుస్సేన్ పీర్, విజయలక్ష్మీ, సునీత, ప్రభంజన్ పాల్గొన్నారు.

కలసపాడులో: గ్రామ, వార్డు సచివాలయాలు సర్వేల శాఖలుగా మారాయని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం సచివాలయ ఉద్యోగుల తరపున సమస్యలపై ఎంపీడీఓ మహబూబ్‌బీకి వినతిపత్రం అందజేసి కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమి త్ర వాట్సప్ సేవ గురించి ఇంటింటికి వెళ్లి వలంటీర్‌లాగా సచివాలయ ఉద్యోగులను క్లస్టర్ మ్యాపింగ్ చేసి క్యాంపెయిన్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం బాధాకరమ న్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగులు వెంకటరాము, యశ్వంత్‌సాయి, రాజేష్, త్రివేణి, నరసింహ, కార్తిక్, సుజిత, మేఘన, నాయబ్‌రసూల్, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మల్హోత్రను సన్మానిస్తున్న దాసరిబాబు

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మైదుకూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు అన్నారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియమి తులైన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పందిటి మల్హోత్రను, ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చాపాడు టీడీపీ మండలాధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డిలను శనివారం దాసరిబాబు పూలమాల, శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు బండి అమర్‌నాథ్, తుపాకుల రమణ, భూమిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

భారతీయ ఎగుమతులపై సుంకాన్ని ఎత్తివేయాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

బద్వేలు, సెప్టెంబరు 6, (ఆంధ్రజ్యోతి): భారతీయ సరుకుల ఎగుమతులపై 50 శాతం సుంకాన్ని పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతోందని వెంటనే సుంకాన్ని ఎత్తివేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో శనివారం సీపీఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయాల కారణంగా సముద్ర తీర ప్రాంతాలలో చేపల రైతులు సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. అలాగే గార్మెంట్స్, టెక్స్ టైల్ రంగాలలో పని చేస్తున్న వేలాదిమంది కార్మికుల ఉపాధికి ఇబ్బందిగా మారుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య , ఏరియా కమిటీ సభ్యులు బాబు, విజయరావు, నారాయణ, చంద్రపాల్, పాండు, చెన్నయ్య పాల్గొన్నారు.

కడపలో వ్యవసాయ కార్మిక సంఘం బహిరంగసభ

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) :కడపలో జిల్లాలోని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ర్యాలీ, బహిరంగ సభ ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పిలుపునిచ్చారు. ఆ మేరకు మైదుకూరు పట్టణంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శివకుమార్ శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో మొదటగా కొత్త బస్‌స్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, గంగులయ్య, లక్ష్మిదేవి, మేరీ, టీబీ, సునీత తదితరులు పాల్గొన్నారు.